క్లుప్తంగా

కిచెన్ గార్డెన్ పరిశీలన



కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మి

నల్లజర్ల: పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందులను విచక్షణారహితంగా వాడటంతో గాలితో పాటు నీరు, తిండి కూడా కలుషితమవుతున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.వెంకటలక్ష్మి అన్నారు. దీనివలన శక్తినివ్వాల్సిన ఆహార ఉత్పత్తులు దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. వీటి నుంచి చిన్నారులు, బాలింతలు, గర్భిణులను రక్షించేందుకు పోతవరం అంగన్‌వాడీ కేంద్రం–44 పరిధిలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పండించే ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కిచెన్ గార్డెన్‌ను గ్రామ పెద్దలతో కలసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఇక్కడ పండించిన ఆకుకూరలు, కూరగాయలను బాలింతలకు, గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మురళీ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గౌరిపల్లిలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న అధికారులు

చాగల్లు: పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గౌరిపల్లి, చంద్రవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 70 పశువులకు, 64 దూడలకు, 235 కోళ్లకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. లంపి చర్మ వ్యాధి, గొంతువాపు వ్యాధి, కొక్కెర వ్యాధులకు నివారణ టీకాలు వేశారు. పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డా.సత్యనారాయణ, సహాయ సంచాలకుడు డా. ఏ.వెంకటరెడ్డి, డా.యు.ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై సమావేశం



పెద్దేవం పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశంలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

తాళ్లపూడి: గ్రామంలో సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు తెలిపారు. పెద్దేవం పంచాయతీ వద్ద మంగళవారం వివిధ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. సర్పంచ్ వెంకట్రావు అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ రెఖపల్లి ముత్యాలరావు, బోడపాటి కాశీ, నామన బుల్లిరాజు, గెద్దం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. సంపత్ వినాయక ఆలయం వద్ద వాటర్ ట్యాంక్ నిర్మిస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

ఉండ్రాజవరం: పుష్యమాసం మంగళవారం సప్తమి సందర్భంగా ఉండ్రాజవరంలో కొలువైన వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విస్తరణమేనా..!

- కొవ్వూరులో 160 రోడ్ల విస్తరణకు కసరత్తు
- సందు గొందుల్లోను కనీసం 12 అడుగులు ఉండాల్సిందే..
- రద్దీగా ఉండే మాస్టర్ ప్లాన్ రోడ్లకు సైతం ప్రతిపాదనలు
- బిల్డింగ్ ప్లాన్ కావాలంటే 3.66 మీటర్లు తప్పనిసరి
- ఆర్డీ ఆమోదిస్తే అభ్యంతరాల స్వీకరణ



కొవ్వూరు పట్టణంలో విస్తరించనున్న మెయిన్ రోడ్డు

కొవ్వూరు: పట్టణవాసులను రోడ్ల విస్తరణ గుబులు పుట్టిస్తోంది. కొవ్వూరు పురపాలక సంఘంలో 23 అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో అధికారులు 17 సర్క్యులేషన్ ప్యాట్రన్లు తయారు చేశారు. దీని ప్రకారం ఆయా ప్రాంతాల్లో కనీసం రోడ్డు 3.66 మీటర్లు(12 అడుగులు) తప్పనిసరి చేస్తున్నారు. పురపాలక సంఘంలో ఉన్న పది సచివాలయాల పరిధిలో 160 రోడ్లను విస్తరించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు జాబితాలను సిద్ధం చేశారు. సందు, గొందుల్లో ఉండే చిన్న రోడ్లను సైతం 12 అడుగులు విస్తరిస్తేనే, ఆయా ప్రాంతాల వారికి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. లేదంటే 30 అడుగుల రోడ్డు వైడింగ్ మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు 30 అడుగుల రోడ్డు విస్తరణకు స్థలం విడిచిపెట్టనవసరం లేకుండానే, జీవో నంబర్ 168 ప్రకారం 3.66 మీటర్లు(12 అడుగులు) రోడ్డు విస్తరిస్తే సరిపోతుందని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీలో గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రోడ్డు కనీసం 40 అడుగులుగా ఉండాలి. రోడ్డు రద్దీని బట్టి గరిష్ట వెడల్పు ఉన్న ప్రదేశాన్ని, కనిష్ట వెడల్పు ఉన్న ప్రదేశం కొలతలు తీసుకుని, మధ్యస్తంగా వెడల్పుని నిర్ణయిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసి, పాలకవర్గ సభ్యుల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

ఈడబ్ల్యూఎస్ ఏరియాలకు..

గతంలో ప్రభుత్వం ద్వారా పట్టాలు పొంది, ఇళ్లు నిర్మించుకున్న కాలనీలను విస్తరణ నుంచి మినహాయింపు ఇచ్చారు. వీటిలో ప్రధానంగా ఇందిరమ్మ కాలనీ, అచ్చాయమ్మ కాలనీ, యనాద కాలనీ, రాజీవ్ కాలనీల్లో అంతర్గత రోడ్ల విస్తరణను విడిచి పెట్టారు. ఈడబ్ల్యూఎస్(ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్) ఉండే ప్రాంతాలను విస్తరణ నుంచి మినహాయింపు ఇచ్చారు.

ప్రధాన రోడ్ల విస్తరణకు ప్రతిపాదన

✧ పట్టణంలో వాటర్ ట్యాంకు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మెయిన్ రోడ్డును 60 అడుగులకు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ రోడ్డు పలుచోట్ల 40 నుంచి 50 అడుగుల వరకు ఉంది. గత పుష్కరాల సమయంలోనే దీనిని విస్తరించాలని ప్రతిపాదించారు. అప్పట్లో కోర్టు కేసులు, స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో వీలు కాలేదు.

✧ బస్టాండ్ సెంటర్ నుంచి విజయవిహార్ సెంటర్ వరకున్న మెయిన్ రోడ్డును సైతం 60 అడుగులు విస్తరించాలని ప్రతిపాదించారు. ఈ రోడ్డు విజయవిహార్ సెంటర్ నుంచి మూడు డబాల వీధి వరకు 35 అడుగులు మాత్రమే ఉంది. మరికొన్ని చోట్ల 45 నుంచి 50 అడుగుల మేరకు ఉంది. దీనిని 60 అడుగులకు విస్తరించాలని కౌన్సిల్‌లో ప్రతిపాదించారు.



కొవ్వూరులో కేవలం 15 అడుగులు మాత్రమే ఉన్న అణంగపాల్ వారి వీధి. 40 అడుగుల మేర విస్తరించాల్సిన రోడ్డు ఇదే..

✧ జూనియర్ కళాశాల నుంచి రౌండ్ పార్కు మీదుగా రైల్వే స్టేషన్ వరకు 40 అడుగుల రోడ్డును విస్తరించాలని నిర్ణయించారు.

✧ ఆర్డీవో కార్యాలయం పక్క రోడ్డును ఇందిరమ్మ కాలనీ వైపు, గౌతమీ నగర్‌లో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి వెళ్లే రహదారి విస్తరించాలని ప్రతిపాదించారు.

✧ ఔరంగబాద్‌లో ఇసుక ర్యాంపు ఎదురుగా ఉన్న రోడ్డు, చర్చి రోడ్డు, వేములూరు పుంత రోడ్లను 30 అడుగుల మేరకు విస్తరించాలని ప్రతిపాదించారు.

✧ ఎరినమ్మ ఘాట్ నుంచి దీప్తి స్కూల్ వరకున్న రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించాలని ప్రతిపాదించారు.

మొత్తం 160 రోడ్లు..

పట్టణంలో ఆరో వార్డు సచివాలయం పరిధిలో ఏకంగా 58 రోడ్లను విస్తరించాలని ప్రతిపాదించారు. పదో వార్డు సచివాలయం పరిధిలో 23, మూడో సచివాలయం పరిధిలో 18, ఒకటి, ఐదు, ఏడు సచివాలయాల పరిధిల్లో 15 రోడ్ల చొప్పున, నాలుగులో తొమ్మిది, ఎనిమిదిలో ఐదు, తొమ్మిదిలో రెండు రోడ్లను విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు.

రోడ్ల విస్తరణకు సహకరించాలి



గతంలో అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఇంటి ప్లానింగ్ అప్రూవల్‌కు కచ్చితంగా రోడ్డు 3.66 మీటర్లు ఉండాలి. పురపాలక సంఘంలో ఏదైనా భవనాలకు ప్లాన్ అప్రూవల్ ఉంటేనే హౌసింగ్ రుణం, వాటర్, కరెంట్ వంటి వాటితో పాటు, డ్రైనేజీ, వీధి లైట్లు ఏర్పాటు చేస్తారు. ప్లాన్ అప్రూవల్ ఉన్న వాళ్లకే పన్ను కూడా తగ్గుతుంది. 168 జీవో ప్రకారం కనీసం రోడ్డు 12 అడుగులుంటే, రోడ్డు వైడింగ్ రిజిస్ట్రేషన్ పురపాలక సంఘానికి చేయనవసరం ఉండదు. ఆ మాత్రం లేకపోతే కనీసం 30 అడుగులు మున్సిపాలిటీకి వైడింగ్ రిజిస్ట్రేషన్ చేసి, స్థలం విడిచిపెట్టాల్సి ఉంటుంది. పట్టణ ప్రజలు తమవంతు సహకరించాలి. ఆర్డీ ఆమోదం పొందాక వారం రోజుల పాటు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తాం.

– టీఎస్ మణిరామ్, టౌన్ ప్లానింగ్ అధికారి, కొవ్వూరు

రోడ్ల విస్తరణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు



రోడ్ల విస్తరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న ఉద్యోగి

కొవ్వూరు: పట్టణంలో రోడ్ల విస్తరణపై టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం పాలక వర్గానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కౌన్సిల్ సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో వార్డుల వారీగా విస్తరణ చేపట్టాల్సిన రోడ్లపై కౌన్సిల్ సభ్యులకు వివరించి, వారి అభిప్రాయాలు స్వీకరించారు. కొన్ని రోడ్లు ఎక్కువ వెడల్పు చేయడం వల్ల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కాస్తా వెడల్పు తగ్గించాలని సభ్యులు సూచించారు. పట్టణంలో 23 అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో 160 రోడ్లను విస్తరించాల్సి ఉందని టౌన్ ప్లానింగ్ అధికారులు వివరించారు. మెయిన్ రోడ్డుతో పాటు, పలు ప్రధాన రహదారులను విస్తరించాల్సి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సభ్యుల సూచనలను నమోదు చేసుకున్నారు. ఈ నివేదికను పురపాలక శాఖ పరిపాలన విభాగం రీజనల్ డైరెక్టర్‌కు ఆమోదం కోసం పంపుతామని టౌన్‌ప్లానింగ్ అధికారి టీఎస్ మణిరామ్ తెలిపారు. పట్టణవాసుల అభ్యంతరాల అనంతరం రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి, టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, కంఠమణి రమేష్‌బాబు, బత్తి నాగరాజు, అక్షయపాత్ర రవీంద్ర శ్రీనివాస్, బొండాడ సత్యనారాయణ, మద్దిపట్ల సాయిగీత, చీరా అరుణ, తోట లక్ష్మి ప్రసన్న, పిల్లలమర్రి మురళీకృష్ణ, కండెల్లి రామారావు, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యను పరిష్కరిస్తాం

- బకాయిలు చెల్లిస్తామన్న దేవదాయ శాఖాధికారులు



ఆలయ అర్చకులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తున్న దేవదాయ శాఖాధికారులు

తాళ్లపూడి: ఛాయాసోమేశ్వర స్వామి ఆలయ అర్చకుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహ తెలిపారు. వేగేశ్వరపురంలోని ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ వివాదాన్ని పరిష్కరించడానికి దేవదాయ శాఖ అధికారులు మంగళవారం ఆలయ అర్చకులు, అర్చక సంఘ పెద్దలు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయానికి ధూపదీప, నైవేద్యాలకు ఆరు ఎకరాలు, అర్చకులకు జీతభత్యాల కోసం పది ఎకరాల వరకు భూములున్నాయి. అర్చకుల భూములు కోర్టులో ఉన్నట్టు సమాచారం. ఆలయ అర్చకులకు కొద్ది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ధూపదీప, నైవేద్యాలకు కూడా నిధులు విడుదల చేయడం లేదంటూ ఆలయ అర్చకుడు సోమవారం ఆలయం గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. దీంతో దేవదాయ శాఖాధికారులు ఈ సమస్యను పరిష్కరించడానికి ఆలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఈవో ఎస్.శివ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ధనుంజయ్ తమ సమస్యలను అధికారుల దృష్టిలో పెట్టారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మాట్లాడుతూ, కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఆలయ అర్చకుల భూముల వివాదాన్ని కొలిక్కి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆలయ భూముల వివాదం కోర్టులో ఉందని, అర్చకునికి రావాల్సిన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు కైగాల రాంబాబు, బ్రాహ్మణ సంఘం పెద్దలు జంధ్యాల గంగాధర శాస్త్రి, మండల అధ్యక్షుడు కూచిభట్ల ప్రసాద్, కొతవరపు విశ్వనాథశర్మ పాల్గొన్నారు. ఇదే సమయంలో బల్లిపాడు, పక్కిలంక తదితర గ్రామాల శివాలయాల అర్చకులు కూడా తమ జీతభత్యాల సమస్యను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహ దృష్టికి తీసుకొచ్చారు.

ముగిసిన సాధు పరిషత్ మహాసభలు

- సభలకు హాజరైన పీఠాధిపతులు, స్వామీజీలు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు



దేవరపల్లిలో నిర్వహించిన అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలో మాట్లాడుతున్న పరమాత్మానంద గిరి స్వామి, వేదికపై వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు, స్వామీజీలు

దేవరపల్లి: స్థానిక కరుటూరి ఫంక్షన్ హాల్లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అఖిలాంధ్ర సాధు పరిషత్ 60వ మహాసభలు మంగళవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. పరిషత్ అధ్యక్షుడు మాతా పరవిద్యానందగిరి స్వామినీ ఆధ్వర్యంలో మహాసభలు నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సభలు నిర్వహించి హిందూ ధర్మం ప్రాధాన్యతను పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలు భక్తులకు వివరించారు. హిందూ ధర్మాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పీఠాధిపతులు సూచించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలు సభల్లో పాల్గొని ధర్మ ప్రబోధాలు గావించారు. దేవరపల్లి ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో మహాసభలకు ఏర్పాట్లు చేశారు. ముగింపు సభలో అఖండానందగిరి స్వామీజీ రచించిన ఇష్టదాష్టకలహరి పుస్తకాన్ని ఆవిష్కరించి పలువురు స్వామీజీలకు అందజేశారు. సద్గురువుల దేవీదేవతల అష్టకాలు, విభిన్న గేయాలు, భజనలు పుస్తకంలో పొందుపర్చినట్టు అఖండానందగిరి స్వామి తెలిపారు. తిరుపతికి చెందిన భక్తుడి సహకారంతో పుస్తకాన్ని ముద్రించినట్టు ఆయన తెలిపారు. ముగింపు సభలో వివిధ ఆశ్రమాధిపతులు నిర్వికల్పానందగిరి స్వామి, విజ్ఞానానందగిరి స్వామిని, ఆశేషానందగిరి స్వామి, దయానందగిరి స్వామి, బ్రహ్మచారి శ్రీరామచైతన్య, నిర్మలానందగిరి స్వామి, కృష్ణానందగిరి స్వామి, ఆత్మానందగిరి స్వామి ఉపన్యసించారు. సభకు పరమాత్మనందగిరి స్వామి అధ్యక్షత వహించగా, పరిపూర్ణానంద సరస్వతీ స్వామి, ప్రసన్నానందగిరి స్వామి, ఆచార్య పరిశుద్ధానందగిరి స్వామి, సంపూర్ణానందగిరి స్వామి, వాసుదేవానందగిరి స్వామి, బాలయోగి రాములు మహారాజ్ స్వామి ఆశీర్వాద ప్రసంగము చేశారు. స్థానిక ఆహ్వాన కమిటీ సభ్యులు పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలను ఘనంగా సత్కరించారు. మూడు రోజుల సభలకు దేవరపల్లి పరిసర మండలాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. ఆహ్వాన కమిటీ సభ్యులు గద్దె మునేశ్వరరావు, బళ్ల సూర్యచక్రం, బలుసు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, సుంకవల్లి వెంకటరామారావు, ఆచంట వెంకట సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, కరుటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహాసభలకు ఏర్పాట్లు చేశారు.

భూముల రీసర్వే ప్రారంభం



అనంతపల్లి శివారు వీరవల్లిలో భూముల రీసర్వే కార్యక్రమంలో సర్వే బృందం

నల్లజర్ల: మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన వీరవల్లిలో మంగళవారం భూముల రీసర్వే కార్యక్రమం ప్రారంభమైంది. రోవర్ ద్వారా సర్వే కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని భూములను బ్లాకులుగా విభజించి రీసర్వే ప్రక్రియ ప్రారంభించినట్టు చెప్పారు. రీసర్వే ఉపయోగాలను రైతులకు వివరించారు. భూ యజమానులు సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సర్వేయర్ సతీష్, వీఆర్వో రామ సీత, సర్వే బృందం పాల్గొంది.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



తాడిపర్రులో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉండ్రాజవరం: రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వి.రామారావు అన్నారు. మండలంలో తాడిపర్రులో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.5 లక్షలతో 90 మీటర్లు, రూ.7 లక్షలతో 100 మీటర్ల పొడవున నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల నంబర్–1లను సందర్శించి, మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామారావు ప్రజలకు సూచించారు. పంచాయతీరాజ్ ఏఈ ఏడుకొండలు, పారిశుధ్య కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, మేట్ రవిబాబు, ఈఏ పృథ్వీ పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు కొవ్వూరుకు రండి

పీఠాధిపతులకు ఎమ్మెల్యే ముప్పిడి ఆహ్వానం



దేవరపల్లిలో నిర్వహించిన సాధు పరిషత్ మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

దేవరపల్లి: గోదావరి పుష్కరాలకు కొవ్వూరు రావాలని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు, స్వామిజీలు, మాతాజీలను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆహ్వానించారు. స్థానిక కరుటూరి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభల్లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రాజమహేంద్రవరం కంటే కొవ్వూరు పుష్కరాలకు ప్రాధాన్యం ఉందన్నారు. కొవ్వూరులోని గోష్పద క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఆయన తెలిపారు. ప్రతి వ్యక్తి దైవభక్తి కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలకు ఎక్కువగా జరుగుతున్నాయని, దేవరపల్లి, లక్ష్మీపురం, యర్నగూడెం, గౌరీపట్నం గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మాణం చేసినట్టు ఆయన తెలిపారు. ఆలయాల నిర్వాహకులకు ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు. మహిళల్లో భక్తి భావం పెరిగిందని, ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో వలంటీర్లుగా సేవలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. దేవరపల్లిలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలు నిర్వహించడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టమని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఆహ్వాన కమిటీ సభ్యులు, స్వామీజీలు ఘనంగా సత్కరించి ఆశీర్వాదం అందజేశారు.

వివేకానందుని బోధనలు స్ఫూర్తిదాయకం



ప్రసంగిస్తున్న స్వామి సేవానంద్ మహరాజ్

నిడదవోలు: స్వామి వివేకానందుడి బోధనలు స్ఫూర్తిదాయకమని రాజమహేంద్రవరానికి చెందిన స్వామి సేవానంద్ మహరాజ్ అన్నారు. బాలాజీ నగర్‌లో ఉన్న రామకృష్ణ సేవా సమితి కేంద్రంలో మంగళవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి సేవానంద్ మహరాజ్ మాట్లాడుతూ స్వీయ నియంత్రణ శక్తి ఎవరికైతే ఉంటుందో వారు జీవితంలో ఏదో ఒకటి సాధించి తీరుతారన్నారు. అనుకున్నది సాధించాలంటే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం, లక్ష్యాలపై దృష్టి పెట్టడంతో పాటు వాయిదా వేయడం పూర్తిగా మానేయాలన్నారు. అనంతరం స్వామి వివేకనంద సూక్తులతో ఉన్న బుక్‌స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సాగర్, రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

చక్కటి పౌష్టికాహారం తీసుకోవాలి



చిక్కాలలో ఆకుకూరలను పంపిణీ చేస్తున్న పీఓ

చాగల్లు: గర్భిణులు, బాలింతలు చక్కటి పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ కొయ్యే మణి అన్నారు. మండలంలోని చిక్కాలలో పోషణ వాటికలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వివిధ రకాల ఆకుకూరలను మంగళవారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ పీఓ డి.మమ్మి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ తమ ఇంటి పెరట్లో కూరగాయల మొక్కలు పెంచితే, ఆరోగ్యకర ఆహారం లభిస్తుందని చెప్పారు. ఏ విధమైన మందులు, ఎరువులు వాడకుండా, ప్రకృతి సిద్ధంగా పెంచిన ఆకుకూరలు, కాయగూరలు తినడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పీవీ పద్మావతి.అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులకు టీకాలతో చెక్

నిడదవోలు రూరల్: పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా తప్పనిసరిగా టీకాలు వేయించి చెక్ పెట్టొచ్చని మండల పశువైద్యాధికారి ఎస్.మోహన్‌రావు అన్నారు. మండలంలోని పందలపర్రులో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులు, కోళ్లకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మారిశెట్టి సత్యనారాయణ, తోరం వీరన్న, ఆకుల మోహన్‌రావు, అత్తిలి సోమశేఖర్, కర్రి వినోద్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



చాగల్లులో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత

చాగల్లు: నెలటూరు–చాగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చాగల్లులో మంగళవారం పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దాత గ్రంధి రాంబాబు సహకారంతో గ్రామంలో పేదలు, పారిశుధ్య కార్మికులకు వీటిని అందజేశారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఏవీ సత్యనారాయణ, వీవీ రామారావు, పచ్చిపులుసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

కొవ్వూరు: కాపవరం గ్రామానికి చెందిన సుంకర పెద సత్యవతి అనే మహిళ వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి అందిన రూ.36,535 ఆర్థిక సాయం చెక్కును మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఈ చెక్కును అందించారు.